ఉల్లి ఎగుమతులు బంద్

- మార్చి 31 వరకు నిషేధం

న్యూఢిల్లీ, డిసెంబర్ 8: ఉల్లి ఎగుమతులను కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఎగుమతులను నిషేధిస్తూ డైరెక్టరేట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) శుక్రవారం నోటిఫికేషన్ జారీచేసింది. దేశీయంగా ఉల్లి ధరలు పెరుగుతుండటం, ఖరీఫ్ సీజన్‌లో ఉల్లి దిగుమతి తగ్గొచ్చన్న అంచనాల నేపథ్యంలో ఎగుమతులపై నిషేధం విధించినట్టు సమాచారం. ప్రస్తుతం ఢిల్లీలో కిలో ఉల్లి రూ.80 వరకు పలుకుతున్నది. గత ఆగస్టులో కూడా ఉల్లి ఎగుమతులపై ఎగుమతి పన్నును కేంద్రం 40 శాతానికి పెంచింది. ఎగుమతులను నిషేధించటంపై ఉల్లి రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో ముంబై-ఆగ్రా రహదారిని వందలమంది రైతులు అనేకచోట్ల దిగ్బంధించారు. అతిపెద్ద ఉల్లి మార్కెట్లయిన లసల్‌గావ్, నందగావ్, పింపాల్‌గావ్, ఉమరాణెల్లో రైతులు నిరసనలు చేపట్టారు. దీంతో మార్కెట్లలో కార్యకలాపాలు స్తంభించిపోయాయి. జైఖేడా, చంద్వాడ్, ముంగ్సేలో కూడా రైతులు ట్రాక్టర్లలో నిరసన ర్యాలీలు నిర్వహించారు.

గోధుమ నిల్వలపై మరిన్ని ఆంక్షలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 8: దేశంలో గోధుమల ధరల అదుపు, అక్రమ నిల్వల కట్టడికి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. హోల్‌సేలర్లు, రిటైలర్లు, బిగ్ చైన్ రిటైలర్లు, ప్రాసెసర్ల సరుకు నిల్వలపై పలు ఆంక్షలు విధిస్తూ నూతన నిబంధనలు జారీ చేసింది. ట్రేడర్లు, హోల్‌సేలర్ల గరిష్ఠ నిల్వ పరిమితిని 2 వేల టన్నుల నుంచి వెయ్యి టన్నులకు, రిటైలర్లకు 10 నుంచి 5 టన్నులకు తగ్గించారు. బిగ్ చైన్ రిటైలర్లు ఒక్కో డిపోకు గరిష్ఠంగా 5 టన్నులు, మొత్తం డిపోలకు 1000 టన్నులకు మించకుండా సరుకును నిల్వ ఉంచుకోవచ్చు. ప్రాసెసర్లు తమ నెలవారీ సామర్థ్యంలో 70 శాతం నిల్వ చేసుకోవచ్చు.

అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తా: పుతిన్

మాస్కో: రష్యాపై తన పట్టును కొనసాగించాలని ఆ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నిర్ణయించుకున్నారు. 2024లో జరిగే దేశాధ్యక్ష ఎన్నికల్లో తాను పోటీ చేయనున్నట్లు ఆయన ప్రకటించారని రష్యన్ మీడియా తెలిపింది. ఆయన రష్యాలో దాదాపు 25 ఏళ్ల నుంచి అధికారం చలాయిస్తున్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధంలో వేలాది మంది రష్యన్లు ప్రాణాలు కోల్పోవడం, క్రెమ్లిన్ సహా దేశంలో అనేక దాడులు జరగడం వంటివేవీ ఆయన ప్రాబల్యాన్ని తగ్గించలేదు. ఇప్పటికీ ఆయనకు మద్దతు అధికంగానే కనిపిస్తున్నది. జూన్‌లో కిరాయి సైన్యం తిరుగుబాటు చేసినప్పటికీ, రష్యాపై పుతిన్ పట్టు సడలలేదు.

మిజోరం సీఎంగా లాల్‌దుహోమా

ప్రమాణ స్వీకారం చేసిన జెడ్‌పీఎం నేత • 11 మందితో రాష్ట్ర క్యాబినెట్ ఏర్పాటు

ఐజాల్, డిసెంబర్ 8: మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన జోరం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పీఎం) నాయకుడు లాల్‌దుహోమా ఆ రాష్ట్ర సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. శుక్రవారం రాజ్‌భవన్‌లో సీఎం లాల్‌దుహోమా, ఇతర మంత్రులతో రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు ప్రమాణ స్వీకారం చేయించారు. 73 ఏండ్ల లాల్‌దుహోమాతోపాటు మరో 11 మంది రాష్ట్ర మంత్రులుగా ప్రమాణం చేశారు. ఏడుగురికి క్యాబినెట్ హోదా దక్కగా, నలుగురికి సహాయ మంత్రిత్వంతో సరిపుచ్చారు. తాజా ఎన్నికల్లో ఓటమి చెందిన మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్‌ఎఫ్) నేత, మాజీ సీఎం జోరంతంగా, మాజీ సీఎం లాల్ ఢాన్‌వాలా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. 40మంది ఎమ్మెల్యేలతో కూడిన మిజోరం ప్రభుత్వంలో సీఎంతో కలుపుకొని మంత్రివర్గంలో గరిష్ట సభ్యుల సంఖ్య 12 మాత్రమే. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో జెడ్‌పీఎం పార్టీ 27 స్థానాలు కైవసం చేసుకుంది. అధికార ఎంఎన్‌ఎఫ్ కేవలం 10 స్థానాలకు పరిమితమైంది. ప్రమాణస్వీకారోత్సవం అనంతరం సీఎం లాల్‌దుహోమా విలేకరులతో మాట్లాడుతూ, 100 రోజుల్లో తన ప్రభుత్వం అమలు జేయబోతున్న 12 ప్రాధాన్య కార్యక్రమాల్ని వివరించారు. రాష్ట్ర రైతాంగానికి తన ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. 'స్థానికంగా రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తుల్నే మా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. అల్లం, పసుపు, మిరప.. మొదలైన వాటికి కనీస ధర ప్రకటిస్తాం. ఇది మా ప్రభుత్వానికి అత్యంత కీలకమైన అంశం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది' అని అన్నారు. 1977లో ఐపీఎస్‌గా ఎంపికైన లాల్‌దుహోమా, 1982లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీకి సెక్యూరిటీ ఇంచార్జ్‌గా పనిచేశారు.

మిజోరం సీఎంగా లాల్‌దుహోమాతో ప్రమాణం చేయిస్తున్న గవర్నర్ హరిబాబు

మిజోరం యువ మహిళా ఎమ్మెల్యేగా బేరిల్

ఈశాన్య రాష్ట్రం మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన జెడ్‌పీఎం అధికార పగ్గాలు చేపట్టింది. 40 మంది సభ్యులగల అసెంబ్లీలో ముగ్గురు మహిళలు విజయం సాధించగా, అందులో బేరిల్ వన్నెయిహ సాంగి అతి పిన్న వయస్కురాలైన ఎమ్మెల్యేగా గుర్తింపు పొందారు. ఐజ్వాల్ దక్షిణం-3 నుంచి జోరమ్ పీపుల్స్ మూమెంట్ (జెడ్‌పీఎం) నుంచి ఎన్నికైన ఈ 32 ఏండ్ల యువతి తన ప్రత్యర్థిపై 9,370 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ప్రస్తుతం పీజీ చేస్తున్న బేరిల్.. ఐజ్వాల్ మున్సిపల్ కార్పొరేటర్‌గా వ్యవహరించారు. టీవీ యాంకర్‌గా కెరీర్ ప్రారంభించిన ఈమె సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా పేరొందారు. ఈమెకు 2.51 లక్షల మందికి పైగా ఫాలోవర్లు ఉన్నారు.

3 రాష్ట్రాల సీఎంల ఎంపికకు పరిశీలకులు

- నియమించిన బీజేపీ అధిష్ఠానం

న్యూఢిల్లీ: ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మూడు రాష్ట్రాల్లో లెజిస్లేటివ్ పార్టీ నేతలను ఎన్నుకునేందుకు బీజేపీ శుక్రవారం పలువురిని కేంద్ర పరిశీలకులుగా నియమించింది. వీరిలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అర్జున్ ముండా, హర్యానా సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ తదితరులు ఉన్నారు. వీరు మిగిలిన పరిశీలకులతో కలిసి రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో కాబోయే ముఖ్యమంత్రి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రెండు, మూడు రోజుల్లో వీరి పేర్లు వెల్లడి కావచ్చునని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ క్రమంలో ఆయా రాష్ట్రాల ఎమ్మెల్యేలు, సీఎం పదవికి పోటీపడుతున్న అభ్యర్థులతో వారాంతంలో సమావేశమై అభిప్రాయాలను సేకరిస్తారు. రాజస్థాన్‌లో రాజ్‌నాథ్ సింగ్ పార్టీ ఉపాధ్యక్షుడు సరోజ్ పాండే, పార్టీ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డేలతో కలిసి అభ్యర్థిని ఎంపిక చేస్తారు. అలాగే ఖట్టర్ మధ్యప్రదేశ్‌లో, అర్జున్ ముండా ఛత్తీస్‌గఢ్‌లలో ఇతర కేంద్ర పరిశీలకులతో కలిసి నేతను ఎంపిక చేసి అధిష్ఠానానికి సిఫార్సు చేస్తారు.

- ఆస్టరాయిడ్ ఢీకొన్నది ఇక్కడే..

ఈ ఫొటోలో కనిపిస్తున్న గుండ్రటి బిలం దక్షిణ లావోస్‌లోని ఎత్తయిన ప్రాంతం బొలవేన్‌లో ఉంది. సుమారుగా 7,50,000 సంవత్సరాల క్రితం ఓ ఆస్టరాయిడ్ భూమిని ఢీకొనడం వల్ల ఈ బిలం ఏర్పడిందని సైంటిస్టులు కనుగొన్నారు. సైంటిస్టుల పరిశోధనపై 'నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' నివేదిక ప్రచురించింది.

కేరళ సీఎంకు హైకోర్టు నోటీసులు

కొచ్చి, డిసెంబర్ 8: కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన కుమార్తె టీ వీణ తోపాటు మరికొందరు రాజకీయ నాయకులకు శుక్రవారం ఆ రాష్ట్ర హైకోర్టు నోటీసులు జారీచేసింది. వీణకు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ ఐటీ సంస్థకు, కొచ్చిన్ మినరల్స్ అండ్ రటిల్ లిమిటెడ్ అనే ప్రైవేట్ కంపెనీకి మధ్య అక్రమ ఆర్థిక లావాదేవీలు జరిగాయన్న ఫిర్యాదుపై దర్యాప్తు జరపాలన్న పిటిషన్‌ను విజిలెన్స్ స్పెషల్ కోర్టు డిస్మిస్ చేయడంపై గిరీశ్ బాబు అనే సామాజిక కార్యకర్త హైకోర్టును ఆశ్రయించడంతో ఈ నోటీసులు జారీ అయ్యాయి. ఈ కేసులో ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ సంస్థతోపాటు కాంగ్రెస్ నేత రమేశ్ చెన్నితల, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) నాయకులు పీకే కన్హలికుట్టి, వీకే ఇబ్రహీం కుంజు తదితరులకు కూడా కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే బాబు ఈ నోటీసులు జారీ చేశారు. ఈ కేసు పెండింగ్‌లో ఉండగానే పిటిషనర్ గిరీశ్ బాబు మరణించడంతో ఆయన తరపున వాదించేందుకు కోర్టు గతంలో ఓ న్యాయవాదిని అమికస్ క్యూరీగా నియమించింది.

అస్సాం ఒకప్పుడు మయన్మార్‌లో భాగమే

- సుప్రీంకోర్టులో కపిల్ సిబల్ వాదన

న్యూఢిల్లీ, డిసెంబర్ 8: అస్సాం, ఇతర ఈశాన్య రాష్ట్రాలలో 1971 మార్చి 25 తర్వాత ప్రవేశించిన అక్రమ వలసదారుల సమగ్ర వివరాలను తమకు సమర్పించాలని సుప్రీం కోర్టు కేంద్రాన్ని గురువారం ఆదేశించింది. అస్సాంలో పౌరసత్వ చట్టం 1955లోని సెక్షన్ 6ఏ చట్టబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను సీజేవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ కొనసాగింది. 1966 జనవరి 1 తర్వాత, 1971 మార్చి 25కు ముందు అస్సాంలోకి వచ్చిన విదేశీ వలసవాదులు భారత పౌరసత్వం పొందాలంటే సెక్షన్ 18 ప్రకారం వారు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. దీనిపై పిటిషనర్ల తరపున ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. అస్సాం ఒకప్పుడు మయన్మార్‌లో భాగమని, అనంతరం ఒప్పందంలో భాగంగా దానిని బ్రిటిష్ వారికి అప్పగించారని చెప్పారు. చరిత్రలో వలసవాదులు, ప్రజలు కలిసిపోయి జీవించారని, వారిని వేరు చేయడం సాధ్యం కాదన్నారు. అస్సాం చరిత్రను గమనిస్తే ఎవరు ఎప్పుడు వచ్చారు అన్న అంశాన్ని గుర్తించడం అసాధ్యమని అన్నారు. జనాభా కదలికల్లో సంక్లిష్టతను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. సెక్షన్ 65ఏ అమలు చేస్తే అస్సాంలో సామాజికంగా, రాజకీయంగా చాలా విస్తృతమైన చిక్కులను తెస్తుందని ఆయన అన్నారు.

'సైబర్ పార్టీ' కలకలం

- డిజిటల్ వ్యవస్థలపై దాడి చేయనున్నట్టు హ్యాకర్‌గ్రూప్ ప్రకటన
- దేశవ్యాప్తంగా అప్రమత్తం

న్యూఢిల్లీ, డిసెంబర్ 8: దేశవ్యాప్తంగా వెబ్‌సైట్లు, కీలక మౌలిక సదుపాయాలపై దాడి చేయనున్నట్టు అదిపెద్ద హ్యాకర్ గ్రూప్ ఒకటి ప్రకటించడంతో దేశం అప్రమత్తమైంది. అనధికారిక యాక్సెస్‌ను నిలువరించేందుకు మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ విభాగాలు సైబర్ సెక్యూరిటీని మరింత బలోపేతం చేస్తుండడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. ఆరోగ్య రంగం, సైబర్ మౌలిక సదుపాయాలను హ్యాకర్ గ్రూప్ లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని భావిస్తున్న ప్రభుత్వ ఏజెన్సీలు వాటిని అప్రమత్తం చేశాయి. అనధికారిక యాక్సెస్‌ను అడ్డుకునే ప్రయత్నం చేయాలని సూచించాయి. సైబర్ దాడులకు ప్రసిద్ధి చెందిన పాకిస్థాన్, ఇండోనేషియాలోని హ్యాకర్ గ్రూపులు 'టెలిగ్రామ్' చానల్ ద్వారా డిసెంబర్ 11న 'సైబర్ పార్టీ'ని ప్రకటించాయి. ఈ చానల్‌లో 4 వేల మందికిపై సభ్యులు ఉన్నారు. 'సైబర్ పార్టీ' పేరుతో దాడికి సిద్ధమవుతున్న ఈ గ్రూప్ భారతీయ డిజిటల్ మౌలిక సదుపాయాలను ఛిన్నాభిన్నం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలుస్తున్నది.

వాట్సాప్‌లో 'వన్ టైమ్' వాయిస్ మెసేజ్!

శాన్‌ఫ్రాన్సిస్కో, డిసెంబర్ 8: ప్రముఖ సోషల్‌మీడియా సంస్థ 'వాట్సాప్', తన వినియోగదారుల గోప్యతను పటిష్టపరుస్తూ మరిన్ని చర్యలు చేపట్టింది. ఒకసారి విన్న తర్వాత.. కనుమరుగయ్యే 'డిజప్పియరింగ్ వాయిస్ మెసెజ్'లను ప్రవేశపెట్టబోతున్నట్టు వాట్సాప్ మాతృసంస్థ 'మెటా' తాజాగా ప్రకటించింది. 'వన్ టైమ్' ఆప్షన్ కింద యూజర్లు పంపే వాయిస్ మెసెజ్‌లు.. వాటిని ఒకసారి విన్న తర్వాత అదృశ్యమవుతాయని కంపెనీ తెలిపింది. వాట్సాప్ 2021లో 'వ్యూ వన్స్ ఆప్షన్' అనేదాన్ని తీసుకొచ్చింది. ఈ ఆప్షన్‌ను ఎంపికచేసి యూజర్లు.. ఫొటోలు, వీడియోలు పంపినట్టయితే, వాటిని అందుకున్న వ్యక్తి ఒక్కసారి మాత్రమే ఆ సందేశాల్ని చూడగలడు. ఆ తర్వాత కనుమరుగవుతాయి. తాజాగా వాయిస్ మెసేజ్‌లకు కూడా దానిని వర్తింపజేస్తున్నట్టు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ విధానం యూజర్ల గోప్యతను మరింత కట్టుదిట్టం చేస్తుందని పేర్కొన్నది. త్వరలో ఇది ప్రపంచవ్యాప్తంగా వాట్సాప్ యూజర్లకు అందుబాటులోకి రానున్నట్టు తెలిపింది.

వెడ్ ఇన్ ఇండియా

- ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిలీ, డిసెంబర్ 8: ఇటీవలి కాలంలో సంపన్నులు డెస్టినేషన్ వెడ్డింగ్‌పై మనసు పారేసుకుంటున్నారు. ఇందుకోసం విదేశాలను ఎంచుకుంటున్నారు. టీమిండియా మాజీ సారథి విరాట్ కోహ్లీ-అనుష్కశర్మ, టాలీవుడ్ ప్రముఖ నటుడు వరుణ్‌తేజ్-లావణ్య త్రిపాఠి వివాహం ఇటలీలో జరిగింది. డెస్టినేషన్ వెడ్డింగ్ కోసం మరికొందరు పింక్ సిటీ జైపూర్‌ను ఎంచుకుంటున్నారు. వీరే కాదు, మరెంతోమంది ఇప్పుడు డెస్టినేషన్ వెడ్డింగ్‌పై మోజు పడుతున్నారు. అయితే, విదేశాల్లో జరిగే ఇలాంటి వివాహాల వల్ల దేశానికి పైసా అదాయం లేకపోగా ఆయా దేశాలు లాభపడుతున్నాయి. పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాన మంత్రి మోదీ సరికొత్త పిలుపునిచ్చారు. 'మేకిన్ ఇండియా' ఉద్యమంలానే 'వెడ్ ఇన్ ఇండియా' ఉద్యమాన్ని ప్రారంభించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. డెహ్రాడూన్‌లో జరిగిన ఉత్తరాఖండ్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ఆయనీ వ్యాఖ్యలు చేశారు. దేవభూమి ఉత్తరాఖండ్‌లో 5 వేల డెస్టినేషన్

వివాహాలు జరిగితే రాష్ట్ర స్వరూపమే మారిపోతుందని, కొత్త మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఓ జంటను కలిపేది దేవుడే అని నమ్మే మనం కొత్త జీవితాన్ని (వివాహం) విదేశాల్లో ఎందుకు ప్రారంభించాలని ప్రశ్నించారు. 'మేకిన్ ఇండియా' ఉద్యమంలానే 'వెడ్ ఇన్ ఇండియా' ఉద్యమాన్ని ప్రారంభించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు.

ఆహార ధాన్యాల ప్యాకింగ్ 100% గోనె సంచుల్లోనే

- నిబంధనలు ఆమోదించిన కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబర్ 8: చక్కెర, ఆహార ధాన్యాల ప్యాకింగ్‌కు జనపనార సంచుల వినియోగంలో తప్పనిసరిగా అనుసరించాల్సిన నిబంధనలను శుక్రవారం కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. జూట్ సంవత్సరం 2023-24కి సంబంధించి విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం ఆహార ధాన్యాలు వంద శాతం, చక్కెర ప్యాకింగ్ 20 శాతం గోనె సంచుల్లోనే విధిగా ప్యాక్ చేయాలి. ప్రభుత్వ నిర్ణయం కారణంగా దేశంలోని జూట్ మిల్లులలో పనిచేస్తున్న నాలుగు లక్షల మందికి, మిల్లులకు అనుబంధంగా ఉన్న వివిధ యూనిట్లకు, 40 లక్షల రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరుతుంది.

ఎమ్మెల్యే వెడ్స్ ఐఏఎస్.. 80 గ్రామాలకు ఆహ్వానం!

- భజన్‌లాల్ మనవడి పెండ్లికి ఘనంగా ఏర్పాట్లు

ఢిల్లీ, డిసెంబర్ 8: సినీ నటి మెహ్రీన్ గుర్తుందా.. 2021లో ఆమెకు ఒక వ్యక్తితో ఎంగేజ్ మెంట్ జరిగింది. అయితే పెళ్లి కాకుండానే వారి బంధం రద్దయ్యింది. ఇంతకీ ఆ వ్యక్తి ఎవరో కాదు భవ్య బిష్ణోయ్. మాజీ ముఖ్యమంత్రి భజన్‌లాల్ మనవడు అయిన బిష్ణోయ్. ప్రస్తుతం బీజేపీ ఎమ్మెల్యే. ఇప్పుడు ఆయన ఐఏఎస్ అధికారిని వివాహం చేసుకోబోతున్నారు. ఇందులో పెద్ద విశేషమేమీ లేకపోయినా ఈ వివాహానికి ఢిల్లీ సహా రెండు రాష్ట్రాల ప్రజలు హాజరవ్వడం మాత్రం విశేషమే. పుష్కర్, ఆదంపూర్, ఢిల్లీ నగరాల్లో రిసెప్షన్‌లు నిర్వహించనున్నారు. డిసెంబర్ 22న రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లో జరిగే వీరి వివాహానికి 80 గ్రామాలకు చెందిన మూడు లక్షల మందికి ఆహ్వానాలు వెళ్లాయి. వీరి వివాహం గురించే ఇప్పుడు విస్తృతంగా చర్చ జరుగుతున్నది. 2019లో సివిల్స్ సాధించి సిక్కింలోని గ్యాంగ్‌టక్‌లో విధులు నిర్వహిస్తున్న ఐఏఎస్ అధికారిణి పరిణి బిష్ణోయ్‌తో భవ్య బిష్ణోయ్‌కు ఏప్రిల్‌లో ఎంగేజ్‌మెంట్ జరుగగా, ఇప్పుడు పెండ్లి కోసం ఘనంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

శ్రీశ్రీశ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానము
యాదాద్రి, యాదాద్రి భువనగిరి జిల్లా - 508115

R.C.No.D/3399/2023 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన తేది: 07.12.2023

శ్రీ.ల.న.స్వా. దేవస్థానమునకు 2024-2025 ఆర్థిక సంవత్సరమునకు అవసరమగు ఫలసరుకులు సరఫరా చేయుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు కోరబడుచున్నవి. పూర్తి వివరముల కొరకు www.eprocurement.gov.in లో Telangana endowments department marketing నందు చూడగలరు. ఇతర వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నం. 8333994017/8333993245

సం/- ఎన్.గీత, ఎమ్.ఎ.ఎల్.ఎల్.బి., కార్యనిర్వహణాధికారి

DIPR RO.No.8521-PP/CL/ADVT/1/2023-24, Dt: 08.12.2023

పురపాలక సంఘ కార్యాలయము తాండూరు :: వికారాబాద్ జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన 2వ కాల్

No.E1/Tenders/08/2023 తేది: 08.12.2023

పని పేరు: సి.సి. రోడ్లు, మీడియన్ మరియు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయుట (1) పనుల అంచనా మొత్తం. రూ. 160.00 లక్షలు, బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేది & సమయం: 08.12.2023, ఉ. 11.00 గంటలకు బిడ్ల స్వీకరణకు చివరి తేది & సమయం: 16.12.2023 సా. 4.00 గంటలకు. తదుపరి వివరాల కోసం అధికారి పేరు చిరునామా, తాండూరు పురపాలక సంఘం, శ్రీ అహ్మద్ షఫీయుల్లా, కమీషనర్, మొబైల్ నం.9849905909, శ్రీ భాజా హుస్సేన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీయర్, మొబైల్ నం. 8074300556 మరియు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://tender.telangana.gov.inలో చూడవచ్చును.

సం/- కమీషనర్, పురపాలక సంఘం, తాండూరు

DIPR RO.No.8501-PP/CL/ADVT/1/2023-24, Dt: 08.12.2023

తెలంగాణ ప్రభుత్వం,
పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగము, సూపరింటెండింగ్ ఇంజినీర్, ఖమ్మం
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

NIT No. 701/2023-24 to 726/2023-24, Dt. 07.12.2023

ఈ దిగువ సంతకందారుచే CRR, SDF, MRR, STSDF, DMFT పథకముల క్రింద ఖమ్మం మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 26 పనుల కొరకు గాను అంచనా విలువ రూ. 2668.95 లక్షలు ఆన్‌లైన్‌లో రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి పిలవబడుతున్నవి. ECV, EMD ఇతర వివరములు https://tender.telangana.gov.in నందు ది. 12.12.2023 నుండి లభించును. భవిష్యత్తులో ఏవైనా సవరణలు, నిబంధనలలో మార్పులు ఉన్నచో పై వెబ్‌సైట్ నుండి మాత్రమే ప్రచురించబడును. సంప్రదించవలసిన ఫోన్ నం. 08742-226893

సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, పి.ఆర్. ఖమ్మం

DIPR RO No.2210-DP/CL/Advt/1/2023-24, Dt: 08.12.2023

తెలంగాణ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్
(తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థ)
ఇ-ప్రొక్యూర్‌మెంట్-టెండరు ప్రకటన-27

టెండరు నెం.లు T137 నుండి T143/2023-24, తేది: 08-12-2023 కొరకు 07 పనులకు సివిల్ పనుల కొరకు టెండర్లు కోరబడుతున్నవి: వరుసగా టెండరు నెం.లు, జిల్లాలోగల పనుల & మొత్తం ECV (రూ. లక్షల్లో) దిగువ విధంగా వున్నవి: T137-భద్రాద్రి కొత్తగూడెం-1-21.02; T138-మహబూబాబాద్-1-21.05; T139&T141-వరంగల్-2-1079.43; T140-కొడాపూర్-1-923.50; T142-రాజన్న సిరిసిల్ల-1-824.45; T143-రంగారెడ్డి-1-857.81; ఆన్‌లైన్‌లో షెడ్యూల్ లభ్యత: 08-12-2023 నుండి. టెండరు నెం.లు T137 & T138/23-24 కొరకు బిడ్ దాఖలుకు చివర తేది/సమయం: 16-12-2023/సా॥ 5.00 గం. టెండరు నెం.లు T139 నుండి T143/23-24 కొరకు బిడ్ దాఖలుకు చివర తేది/సమయం: 22-12-2023/సా॥ 5.00 గం.తదుపరి వివరాలను వెబ్‌సైట్: www.tender.telangana.gov.inలో చూడవచ్చును.

DIPR RO.No. 8514-PP/CL/ADVT/1/2023-24, Dt: 08-12-2023 సం/- చీఫ్ ఇంజినీర్

పత్రికా ప్రకటన
జిల్లా గ్రంథాలయాల సంస్థ, రంగారెడ్డి జిల్లా
ఆదిభట్ల రోడ్డు, వెంకటాద్రి నగర్ కాలనీ, బడంగ్‌పేట్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ-500112

Rc.No. EO/Pra/2/2023 తేది: 09-12-2023

శ్రీమతి ఇ. జయంతి కుమారి, జూనియర్ అసిస్టెంట్, జిల్లా గ్రంథాలయాల సంస్థ కార్యాలయం, రంగారెడ్డి జిల్లా వారు 29-09-2022 నుండి నేటి వరకు విధులకు అనధికారిక గైర్హాజరు ఆరోపణలపై రెగ్యులర్ ఎంక్వయిరీ నిర్వహించుటకు ఎంక్వయిరీ ఆఫీసర్‌గా నన్ను నియమించారు. Pro.Rc.No. 67-D/19, తేది: 16-10-2023 ప్రకారం చైర్మన్, జిల్లా గ్రంథాలయాల సంస్థ, రంగారెడ్డి జిల్లా వారు G.O.1708 Edn తేది: 12-09-1968లో జారీ చేసిన CCA రూల్స్ లోని రూల్ 8(2) క్రింద విచారణ నిర్వహించుటకు ఎంక్వయిరీ ఆఫీసర్‌గా నన్ను నియమించారు.

ఆఫీసులో ఇచ్చిన ఇంటి చిరునామాలో ఆమె నివసించుటలేదని మరియు సెక్రటరీ, జిల్లా గ్రంథాలయాల సంస్థ, రంగారెడ్డి జిల్లా వారు ఆమెకు రిజిస్టర్డ్ పోస్టు ద్వారా పంపిన లెటర్లు పోస్టల్ అధికారుల ద్వారా వాపసు వచ్చినవని తెలిసినది.

అందువలన, జిల్లా గ్రంథాలయాల సంస్థ, రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో 16-12-2023న సాయంత్రం 5.00 గంటలలోగా ఎంక్వయిరీ ఆఫీసర్ సమక్షంలో హాజరు కావలసిందిగా ఆమెను ఆదేశించడమైనది. పైన తెలిపిన తేదీ, సమయంలో ఆమె హాజరు కాకపోతే, రికార్డులలో లభించే మెటీరియల్ ఆధారంగా రూల్స్ ప్రకారం ఆమెపై తదుపరి చర్య తీసుకోబడుతుంది.

సం/- ఎంక్వయిరీ ఆఫీసర్ & లైబ్రేరియన్ Gr-1
జిల్లా గ్రంథాలయాల సంస్థ, రంగారెడ్డి జిల్లా, H.Q: బడంగ్‌పేట్

DIPR RO.No. 8523-PP/CL/ADVT/1/2023-24, Dt: 08-12-2023

ఎనీ టైమ్ అడ్మిషన్స్

- దివ్యాంగులు ఎప్పుడొచ్చినా బడుల్లో చేర్చుకోవాలి
- 100% వైకల్యం ఉన్న విద్యార్థులకు హాజరు నుంచి మినహాయింపు
- పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని దివ్యాంగ విద్యార్థులకు విద్యాసంవత్సరంలో ఎప్పుడైనా అడ్మిషన్లు ఇవ్వాలని సంబంధిత అధికారులను విద్యాశాఖ ఆదేశించింది.విద్యాసంవత్సరం ప్రారంభం, మధ్యలో, చివర్లో ఎప్పుడొచ్చినా వీరిని బడుల్లో చేర్పించుకోవాలని స్పష్టంచేసింది. ఇక వంద శాతం వైకల్యం ఉన్న విద్యార్థులు పాఠశాలకొచ్చే అవకాశం లేకపోవడంతో వీరికి హాజరు శాతం నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలిపింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని ప్రతి వెయ్యి మంది విద్యార్థుల్లో ఒకరు ఏదో ఒక వైకల్యానికి గురవుతున్నట్టు పాఠశాల విద్యాశాఖ సర్వేలో వెల్లడైంది. వీరిలో అత్యధికులు బుద్ధిమాంద్యం బారినపడుతున్నట్టుగా తేలింది. రాష్ట్రంలో మొత్తం 54,362 మంది పిల్లలు వైకల్యంతో బాధపడుతున్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాలతో పోల్చితే దక్షిణ తెలంగాణ జిల్లాల్లోనే అధిక విద్యార్థులు వైకల్యం బారినపడుతున్నట్టుగా విద్యాశాఖ తేల్చింది.

దివ్యాంగ విద్యార్థుల కోసం మార్గదర్శకాలివీ..

- రాష్ట్రంలోని దివ్యాంగులు ఎలాంటి వివక్షకు తావులేకుండా అడ్మిషన్లు కల్పించాలి.
- 6 నుంచి 18 ఏండ్ల చిన్నారులందరిని వారి సమీప పాఠశాలల్లో చేర్పించాలి.
- వీరి వయస్సును బట్టి ఏ తరగతికి సరిపోతారో ఆయా తరగతుల్లో అడ్మిషన్లు ఇవ్వాలి